## సీతారామచంద్రస్వామి విగ్రహప్రతిష్ఠాపన

**గుమ్మడిదల, మే 14, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగవైభవంగా బుధవారం జరిగింది. గ్రామప్రజలు, ఇతరగ్రామాల ప్రజలు పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈపవిత్ర కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వేదపండితులసారథ్యంలో సాగింది. గ్రామ దేవాలయకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈమహోత్సవానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు గ్రామాల్లో శాంతి, ప్రజలమధ్య సామరస్య, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, వేణు, మాజీ ఎంపిటిసి గోవర్ధన్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, సదానందరెడ్డి, రాజిరెడ్డి, లింగం, అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, కడాలి మురళి, మంగయ్య, వెంకటేష్, వీరారెడ్డి, స్వేచ్ఛారెడ్డి, మల్లారెడ్డి, సంజీవరెడ్డి, గ్రామస్థులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవాలు

**-పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్**

**నర్సాపూర్, మే 14, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో గత రెండురోజులుగా గ్రామ మాజీ సర్పంచ్ శ్యామలలక్ష్మణ్‌గౌడ్, నాయకులు సురేష్‌గౌడ్, భాస్కర్‌చారి, బాలరాజ్‌గౌడ్, రమేష్‌గౌడ్‌లతోపాటు గ్రామస్థుల ఆధ్వర్యంలో శ్రీశివపంచాయతన సంతానగేశ్వర, నాభిశిల(బొడ్రాయి) శిఖరసహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈప్రతిష్ఠ మహోత్సవాలు వేదపండితులు ఆలయపూజారి హరిప్రసాద్‌శర్మబృందం వేదమంత్రాలమధ్యన వైభవంగానిర్వహించారు. కార్యక్రమానికి బిజెపి జిల్లాఅధ్యక్షులు వాల్‌దాస్ మల్లేష్‌గౌడ్ హాజరయ్యి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లాఅధ్యక్షులు వాల్‌దాస్ మల్లేష్‌గౌడ్‌తో పాటు బిజెపి మండల అధ్యక్షులు నీలి నాగేష్, బిజెపి నాయకులు నారాయణరెడ్డి, బోర్‌వెల్ రాంరెడ్డి, రాములునాయక్, నాగేష్‌గౌడ్, బాలరాజు, జమునగళ్ళ కుమార్, శ్రీశైలంగౌడ్, శ్రీను బిజెపి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే 181,100 నంబర్‌కు కాల్‌చేయండి

**-రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి**

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 14, ప్రభాతవార్త:**
పని ప్రదేశంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా 181, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా మహిళా సాధికారత డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ సంతోషితో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2013లో తీసుకువచ్చిన నూతనచట్టం ప్రకారం మహిళలను వేధిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

## అంధకారంలో సీతానగర్

**పాపన్నపేట, మే 14, ప్రభాతవార్త:**
పాపన్నపేట మండలపరిధిలోని సీతానగర్ గ్రామంలో చీటికిమాటికి కరెంట్‌పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా తమ గ్రామంలో విద్యుత్‌సమస్య తలెత్తుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. మంగళవారం సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు విద్యుత్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వారు ఆరోపించారు. ఏ అధికారికి ఫోన్ చేసినా కనీసం స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నిరోజులుగా నిత్యం కరెంట్ సమస్య ఎదురవుతుందని వారు పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్ అంతరాయం కలిగినా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

**చిన్నకోడూరు, మే 14, ప్రభాతవార్త:**
సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీష్‌రావుకు అధికారం కోల్పోయినప్పటి నుంచి కాంగ్రెస్ సర్కార్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు అంకర్ మధు అన్నారు. కాంగ్రెస్‌సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలను చూసి జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. యువత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు సిఎం రేవంత్‌రెడ్డి కల్పిస్తుంటే హరీష్‌రావు సహించలేకపోతున్నారన్నారు. హరీష్‌రావు సిద్దిపేటను గాలికివదిలేసి హైదారాబాద్‌లో ప్రెస్‌మీట్లు పెడుతూ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని అన్నారు. సమయం వచ్చినప్పుడు పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు, హరీష్‌రావుకు సిద్దిపేట ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు అని గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కొండం శ్రీనివాస్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు పల్లె రాజు, మండల నాయకులు సత్యనారాయణరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆభరణాల దొంగల అరెస్టు

**-బంగారం, వెండి, నగదు స్వాధీనం: డిఎస్పి సత్తయ్యగౌడ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి సత్తయ్యగౌడ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 14, ప్రభాతవార్త:**
వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు సంగారెడ్డి డిఎస్పి సత్తయ్యగౌడ్ తెలిపారు. బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డిలోని రాజంపేటకు చెందిన మార్ల యాదగిరి అనే వ్యక్తి తన భార్య అనిత, బంధువు లక్షీ ్మలతో కలిసి తాళాలు వేసిన ఇండ్లు టార్గెట్ చేసి, దొంగతనాలకు పాల్పడుతున్నారని డిఎస్పి తెలిపారు. సంగారెడ్డిలోని బైపాస్ వద్ద ఆటోలో ప్రయాణిస్తూన్న నిందితులు, పోలీసులు కనిపించగానే పారిపోతుండగా సంగారెడ్డి రూరల్ సిఐ క్రాంతికుమార్ తనసిబ్బందితో కలిసి వారిని పట్టుకుని విచారించగా, వారు చేసిన దొంగతనాలను ఒప్పుకున్నారని డిఎస్పి తెలిపారు. వివిధ దొంగతనాలలో, దొంగిలించిన 30 తులాల బంగారం, 18 తులాల వెండి, నాలుగు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి సత్తయ్యగౌడ్ తెలిపారు. నిందితుడు మార్ల యాదగిరిపై గతంలో 47 దొంగతనాల కేసులు ఉన్నాయని, ప్రస్తుతం రూరల్ పోలీస్ స్టేషన్లో మూడు, టౌన్ పోలీస్ స్టేషన్లో రెండు, హత్నూర పోలీస్ స్టేషన్ లో ఒక దొంగతనం చేసినట్లు నమోదు అయిందని అన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు డిఎస్పి సత్తయ్యగౌడ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో రూరల్ సిఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు. ఇండ్లకు తాళాలు వేసి వెళుతున్నప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని, ముందస్తు జాగ్రత్తగా అవసరమైతే సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డిఎస్పి సత్తయ్యగౌడ్ ప్రజలకు సూచించారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ

**-తహసీల్దార్ మన్నన్**



ఫోటో-4 విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్ధార్ మన్నన్

**చిన్నశంకరంపేట, మే 14, ప్రభాతవార్త:**
క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందని తహసీల్దార్ మన్నన్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిడివో కార్యాలయ సిబ్బంది, తహసీల్ధార్ కార్యాలయ సిబ్బందికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విజేతగా నిలిచింది. గెలిచిన టీంకు తహసీల్దార్ మన్నన్ బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభా పురస్కారాల సన్మాన సభ

**-విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా విద్యను ప్రోత్సహించాలి ఎంపి రఘునందన్‌రావు**
**-విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే ప్రతిభా పురస్కారాలు కలెక్టర్ రాహుల్‌రాజ్**

**సంగారెడ్డి బ్యూరో, మే 14, ప్రభాతవార్త:**
బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో మెదక్ నియోజకవర్గ ఎంపి మాధవనేని రఘునందన్ రావు, జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్‌అధికారి రాజిరెడ్డి, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎస్‌సి2025లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాల సన్మానసభ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఎస్‌సి 2025 పదవతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా 12వస్థానంలో నిలవటం ఎంతో గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీవిద్యార్థులను ప్రోత్సహించడమే ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని (83) పాఠశాలలు వందశాతం ఉత్తమ ఫలితాలుసాధించి, జిల్లాను అగ్రభాగాన నిలబెట్టాయని వివరించారు. 550మార్కులపైన ఫలితాలు సాధించిన విద్యార్థులు 196మంది ఉన్నారని తెలిపారు. విద్యాశాఖ పక్షాన 570పైన మార్కులు సాధించిన 17మంది విద్యార్థినీవిద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, మండలాల నోడల్ అధికారులు విద్యార్థినీవిద్యార్థులను ఎంతగానో ప్రోత్సహించి, వారు ఉత్తమ ఫలితాలు సాధించేదిశగా కృషిచేసి, కీలకపాత్ర పోషించారని తెలిపారు. అదేవిధంగా తల్లిదండ్రులు విద్యార్థినులను ఉన్నతచదువులు చదివించాలని కోరారు.

ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్‌సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు మాట్లాడుతూ జిల్లాకలెక్టర్ పర్యవేక్షణలో పదిలో ఉత్తమఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు, వారి తల్లిదండ్రులను జిల్లా యంత్రాంగం తరపున ఎంతగానో అభినందించారు. జిల్లా విద్యాశాఖను విద్యార్థినీవిద్యార్థుల ఆలోచనలకు, అభిరుచులకు అనుగుణంగా ఎంచుకున్న రంగాన్ని ప్రోత్సహిస్తూ వారి జీవనప్రగతిపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. పిల్లలను ఎస్ఎస్సిలో సరిగా మార్కులు రాలేదని అవమానపరిచే విధంగా తల్లిదండ్రులు మాట్లాడకూడదని పిల్లలు మానసిక సంఘర్షణకు లోనుకాకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులను ఇంటర్మీడియట్లో జాయిన్ అయ్యే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చొరవ క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలను ఇస్తాయని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో నూరుశాతం ఫలితాలు లక్ష్యంగా మెతుకు సీమ జిల్లా కీర్తిని విద్యారంగంలో చాటిచెప్పాలని ఈ సందర్భంగా ఎంపి అభివర్ణించారు. ఉత్తమ మార్కులు సాధించిన 196మంది విద్యార్థినీవిద్యార్థులకు వారితల్లిదండ్రులతో అలాగే 82మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్, ప్రత్యేక అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈసమావేశంలో అన్నిమండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, సంబంధిత సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎంపి రఘునందన్‌రావు

# కెసిఆర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం..

**-పొంగి పొర్లుతున్న మురికి నీరు..**
**-పట్టించుకోని మున్సిపల్ అధికారులు..**



మురికి కాలువ పొంగి సెలయేరులా పారుతున్న దృశ్యం

**రామాయంపేట, మే 14, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కెసిఆర్ కాలనీలో (డబుల్ బెడ్ రూమ్) డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురువుతున్నారు. మురికి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, పైగా అప్పటి కాంట్రాక్టర్ నాసిరకం సిమెంటు పైపులు వాడడం, ఆ పైపులు తరచుగా పగిలిపోవడం, మురికి నీరంతా పొంగి రోడ్డు పైన సెలయేరు లాగా పారుతుండడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. ఒకవైపు మురికి కాలువలు పొంగడం, మరోవైపు సెప్టిక్ ట్యాంక్ నుండి వ్యాపిస్తున్న దుర్వాసనతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని పలుమార్లు మున్సిపల్‌శాఖ అధికారులకు విన్నవించుకొన్నా వారు నామమాత్రంగా పనులు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. కాలం చెల్లిపోయిన సిమెంటు పైపుల స్థానంలో ప్లాస్టిక్ పైపులు వేసి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాల్సిన అధికారులు ఆదిశగా ప్రయత్నాలు ప్రారంభించకపోవడం శోచనీయం. డ్రైనేజీ పొంగి, మురికినీరంతా రోడ్డు పైన ప్రవహిస్తుంది. అధికారులు కేవలం పారిశుధ్య సిబ్బందితో తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు తప్ప, శాశ్వతంగా సమస్య పరిష్కారానికి కృషిచేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కాలం చెల్లిన సిమెంట్ పైపుల స్థానంలో ప్లాస్టిక్ పైపులను వేయాల్సి ఉండగా, మున్సిపల్‌లో డబ్బులు లేవని అధికారులు చెప్పడం గమనించదగ్గ విషయం. కాలనీలో ఉన్న సమస్యలను చెప్పుకుందాం అంటే సంబంధిత అధికారులు కాలనీ వైపు రావడం లేదనీ, అందరిమాదిరిగానే తాము కూడా ఇంటి టాక్స్ కడుతున్నామని, అయినా ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరచాలని, సెప్టిక్‌ట్యాంక్ నుండి వ్యాపి స్తున్న దుర్వాసన రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## మైనార్టీ గురుకుల అడ్మిషన్ల పోస్టర్

**-ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 14, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆవిష్క రించారు. మైనార్టీ విద్యార్థులు 5వతరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అధికారులు, జిల్లా మైనారిటీ గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

## వివాదాస్పదంగా మారిన భూ సర్వే

**-భూ సర్వేపై అన్నదాతల ఆందోళన**
**-రైతుల భూములు లాక్కుంటే ఊరుకునేది లేదు**
**-బాధిత రైతుల ఆందోళన**



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణగౌడ్

**చిన్నశంకరంపేట, మే 14, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేటమండలం కామారంతండాలో సర్వేయర్ ఎడి శ్రీనివాస్, ఎస్ఐ నారాయణగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం కామారంతండా లో ఓ ప్రయివేటు భూమి సర్వేను నిర్వహించారు. ఈసర్వేను బాధితరైతులు అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. గత కొన్నిసంవత్సరాల నుండి ఈభూమి వివాదంలో ఉందని, ఓవ్యక్తి సంతకా లను ఫోర్జరీ చేసి పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. ఈవివాదం కోర్టులో నడుస్తుందని, ఈ సమయంలో ఈసర్వే చేయడం ఏంటని అధికారులను బాధిత రైతులు ప్రశ్నించారు. సర్వే నిర్వహిస్తున్న క్రమంలో డిజిటల్ మిషన్‌ను లాక్కోవడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. దీంతో తండాలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసు కుంది. పోలీసులకు, రైతులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. తమ భూములను కాపాడుకునేం దుకు పోరాటాలు చేస్తామని రైతులు అధికారులను హెచ్చరించారు.

**రైతులకు సహకరిస్తాం....**
ఈ సందర్భంగా జిల్లా సర్వేయర్ ఎడి శ్రీనివాస్ మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నామని తెలిపారు. భూమిని న్యాయపరంగా సర్వే నిర్వహించి హద్దులను చూపించి సర్వే నివేదికను పై అధికారులకు అందిస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బాధిత రైతులకు న్యాయం చేసేందుకు సహకరిస్తామన్నారు.

## అనుమానస్పద స్తితిలో వ్యక్తి మృతి

**పాపన్నపేట, మే 14, ప్రభాత వార్త:**
అనుమానస్పద స్థితిలో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పొడిచన్పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొడిచన్పల్లికి చెందిన సర్దన కిష్టయ్య(40)కు భార్య లక్షి ్మ, కూతురు గంగమణి, కొడుకు బీరప్ప ఉన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి వచ్చి, ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారిలేచి చూసేసరికి చనిపోయి ఉన్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పాపన్నపేట ప్రొబేషనరి ఎస్సై నరేష్ కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించటం జరిగింది.

## ఫారెస్ట్ జీప్ ఢీ.. మహిళకు తీవ్రగాయాలు...

**పాపన్నపేట, మే 14, ప్రభాత వార్త:**
పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగ్ శివారులో నడుచుకుంటూ వెళుతున్న ఒక మహిళను ఫారెస్ట్ జీపు ఢీకొన్న సంఘటనలో ఆ మహిళ తీవ్ర గాయాలపాలైన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మండల పరిధిలోని రాజ్య తాండ నుండి నార్సింగ్ వైపు నడుచుకుంటూ వెళుతున్న లునావత్ కమిలిబాయ్‌ని పెద్ద శంకరంపేట వైపు నుండి వస్తున్న ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌కు చెందిన జీపు వెనుక నుండి ఢీకొట్టింది. దీంతో బాధితురాలు తీవ్రంగా గాయాలపాలయింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. అయితే డ్రైవర్ మద్యంమత్తులో ఉన్నట్టు స్థానికులు ఆరోపించారు. ఈ విషయమై పాపన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి: రూ.లక్ష నష్టం

**నర్సాపూర్, మే 14, ప్రభాతవార్త:**
ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఒకగేదె మృతిచెందిన సంఘటన నర్సాపూర్ మండలపరిధిలోని లింగాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. సంఘటనవివరాలు బాధితుల, గ్రామస్థుల కథనం ప్రకారం లింగాపూర్‌గ్రామానికి చెందిన దండు వెంకటయ్యకు చెందిన గేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిందని తెలిపారు. రోజు మాదిరిగానే మేతకోసం వెళ్ళి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌గురైన గేదె అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఈగేదె పాలతో తను జీవనోపాధి పొందుతున్నానని ఇప్పుడు జీవనోపాధి సాగేది ఎట్లా అని బాధితుడు దండు వెంకటయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఈగేదె సుమారు లక్ష రూపా యల విలువ ఉంటుందని బాధితుడు వెంకటయ్య తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయాన్ని అందించాలని బాధితుడు దండు వెంకటయ్య కోరారు.

## మద్యంతో పట్టుబడిన కారు వేలం

**హావేలీఘనపూర్, మే 14, ప్రభాతవార్త:**
మద్యంతో పట్టుబడిన కారును ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ మెదక్‌లో వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం 11గంటలకు కారు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం తొమ్మిది గంటలకు ఈఎండి డబ్బులు చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసిందిగా ఎక్సైజ్ సిఐ తెలిపారు.

## వీరభద్రాలయంలో మంత్రి దామోదర్ ప్రత్యేక పూజలు

-బొడ్మట్‌పల్లిలో భద్రకాళీవీరభద్రుల కళ్యాణోత్సవం



బొడ్మట్‌పల్లిలో భద్రకాళీవీరభద్రస్వామి కళ్యాణోత్సవం ఇన్‌సెట్లో మంత్రి దామోదర్ హాజరైన దృశ్యం

**టేక్మాల్, మే 14, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండలపరిధిలోని బొడ్మట్‌పల్లి శ్రీభద్రకాళీసమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చన, అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కళ్యాణవేదికపై భద్రకాళీవీరభద్రుల కళ్యాణం కమనీయంగా జరిగింది. లోకకల్యాణార్థం తలపెట్టిన ఈకార్యక్రమానికి ఆలయకమిటీ చైర్మన్ బస్వరాజ్ స్వాగతం తెలిపారు. కళ్యాణోత్సవానికి 8మంది దంపతులు, వివాహోత్సవ కార్యక్రమానికి పెళ్ళిపెద్దలుగా మారారు. హాజరైన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. చుట్టుపక్కల గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదానంలో పాల్గొన్నారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన విగ్రహాల ఊరేగింపులో స్వాములు చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**వీరభద్రుని దర్శించుకున్న మాజీ మంత్రి దామోదర్...**
రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ బొడ్మట్‌పల్లి గ్రామంలోని శ్రీభద్రకాళీసమేత వీరభద్రుని ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు శంకరప్ప, గ్రామ యువజనకాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి ఆలయకమిటీ చైర్మన్ బస్వరాజ్ వారికి శాలువలు కప్పి సన్మానించారు. ఇందులో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికే కాంగ్రెస్ సర్కారు

-కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, అత్తు



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న దృశ్యం

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
కాంగ్రెస్‌సర్కారు అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుచేస్తూ పేదల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతుంటే బిఆర్ఎస్, బిజెపిలకు మింగుడుపడడం లేదని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లు అన్నారు. జిల్లా కేంద్రంలోని కోటిలింగాల దేవాలయంలో దేవాలయ డైరెక్టర్లుగా బుధవారం ప్రమాణ స్వీకారంచేసిన కార్యక్రమంలో వారుపాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌సర్కారు చేస్తున్న మంచిపనులను చూసి జీర్ణించుకోలేక సిఎం, మంత్రులు, కాంగ్రెస్ పార్టీపై అర్థంపర్థంలేకుండా విమర్శలు, ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగాలంటే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముద్దం లక్ష్మీ, గంప మహేందర్‌రావు, దేవులపల్లి యాదగిరి, సతీష్ గౌడ్, రజని, సలీం, వంశీ, సాంబమూర్తి, నూతన డైరెక్టర్లు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో హనుమాన్ తెప్పోత్సవం




విలేకరులతో ట్రస్ట్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మే 14, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెరువులో హనుమాన్ తెప్పోత్సవం ఈనెల 15న సాయంత్రం 5 గంటలకు నిర్వహించడం జరుగుతుందని రామరాజు రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో మాత్రమే నిర్వహించే తెప్పోత్సవం సిద్దిపేటలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రామరాజు రావిచెట్టు హనుమాన్‌దేవాలయం నుంచి శోభాయాత్రగా బయలుదేరి కోమటిచెరువువద్ద తెప్పోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. తెప్పోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొంటారని తెలిపారు. తెప్పోత్సవంలో హనుమాన్ స్వాములు, హనుమాన్ భక్తులు, హిందూ బంధువులు పెద్దయెత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అర్చకులు వైద్య కృష్ణమాచార్య, ట్రస్ట్ సభ్యులు నేతి కైలాసం, గ్యాదరి పరమేశ్వర్, నందిని శ్రీనివాస్, కుమ్మరికుంట రమేష్, తిప్పరాజు మధుసూదన్, చింత శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిని తొలగించాలి

-ఎంపిడివోకు వినతిపత్రం అందజేసిన గ్రామస్థులు



ఎంపిడివోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

**రాయపోల్, మే 14, ప్రభాతవార్త:**
తమ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని రాయపోల్ మండలపరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామస్థులు బుధవారం ఎంపిడివో బాలయ్యకు వినతిపత్రం అందజేసారు. ఈసందర్భంగా వీరారెడ్డిపల్లి గ్రామస్థులు మాట్లాడుతూ..ఏదైనా పనులనిమిత్తం పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్తే దురుసుగా సమాధానం చెప్తుందన్నారు. గ్రామంలో మురుగు కాలువలు, చెత్తాచెదారం తొలగించమని పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. డ్రైవర్ లేక చెత్త ట్రాక్టర్ చాలా రోజుల నుండి నడవడం లేదన్నారు. తమ గ్రామం నుంచి పంచాయతీ కార్యదర్శిని తొలగించి కొత్త పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరామని తెలిపారు. ఎంపిడివోకు వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్థులు ఆంజనేయులు, సత్తయ్య, స్వామి, కుమార్ తదితరులు ఉన్నారు.

# విద్య, వైద్యం ప్రభుత్వ ప్రధాన ఎజెండా...

-ఎంఎల్ఏ మైనంపల్లి రోహిత్‌రావు



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, మే 14, ప్రభాత వార్త:**
బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇంటర్మీడియట్ అధికారిని మాధవి, సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్, విద్యార్థినీ విద్యార్థులతో మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్‌రావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయికి ధీటుగా విద్యాబోధన జరుగుతుందని, కష్టపడి చదువుకుని ఉన్నతస్థానంలో మంచి ఫలితాలుసాధించి ప్రతిభాపురస్కారాలు అందుకోవడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యం ప్రధాన అజెండాగా ముందుకు పోతుందని, శాసనసభ్యులుగా గెలుపొందిన 14 నెలల్లో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు పరిశీలించినప్పుడు బాలికలు మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బందిపడేవారని అన్నిపాఠశాలల్లో మరుగుదొడ్లు వసతిని కల్పించామని తెలిపారు. విద్యాశాఖలో సమూలమార్పులు చోటుచేసుకునే విధంగా రామాయంపేటలో 200 కోట్ల రూపాయలతో 20 ఎకరాలలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసుకున్నామన్నారు, విద్య, వైద్య రంగాలలో మౌలిక వసతులు కల్పించుకుంటూ ప్రభుత్వ విద్యను బలోపేతంచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెదక్‌లో ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యూయేషన్ సెంటర్స్ తీవ్ర సమస్యగా గుర్తించి ఇంటర్మీడియట్ వేల్యూయేషన్ సెంటర్ మంజూరు చేయించిన ఘనత మాదేనని తెలిపారు. పిల్లలకు స్కాలర్‌షిప్ ఆగిపోయిందని గుర్తించి మూడుకోట్ల రూపాయల స్కాలర్‌షిప్ మంజూరు చేయించామని చెప్పారు. మెదక్ నియోజకవర్గంలో ప్రభుత్వపాఠశాలలు,కళాశాలలో ఉన్నతవిద్య నభ్యసించడానికి ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఇది ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం. మీ ఒక్కరికే సన్మానం కాదని మీ కాలేజీల్లో చదువుకున్న ప్రతి ఒక్కరికి సన్మానంలాగా భావించాలని కలెక్టర్ అన్నారు. ఎంతోమంది తల్లిదండ్రులు అధికఫీజులు వెచ్చించి కార్పొరేట్ కళాశాలలో చేర్పిస్తారని, ఈరోజు ప్రైవేట్ కాలేజీలకు ధీటుగా మన ప్రభుత్వ కళాశాలలు రూపుదిద్దుకొని ఉత్తమ ఫలితాలు సాధించుకోవడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్ తర్వాత కూడా పై చదువుల్లో లెక్చరర్స్ గైడెన్స్‌తో ప్రణాళికాబద్ధంగా ముందుకు పోవాలన్నారు. అనంతరం ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 200మంది విద్యార్థినీ విద్యార్థులను, 50 కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ సన్మానించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్, విద్యార్థినీవిద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖేడ్ అభివృద్ధికి కృషి..

-జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి
-బాలికలకు టివి బహూకరించిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, మే 14, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ సమగ్ర అభివృద్ధికి తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని బాలసదనంలో ఈరోజు అనాథ పిల్లల మధ్యలో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం పిల్లలతోకలిసి కేక్ కట్‌చేసిన ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా బాలసదనంలో అనాథపిల్లల కోసం టివిని వారి సొంత ఖర్చులతో వారివిద్యకు, పిల్లల కొరకు న్యాప్కిన్స్ డొనేట్ చేశారు. అనంతరం పిల్లలందరూ కలిసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వారికి ఎల్ఈడి టివి అందించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే నారాయణఖేడ్ ఆర్టీసీడిపోకు 30కొత్తబస్సులు మంజూరు కాగా బుధవారం స్థానిక బస్టాండ్లో ఆరు బస్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే 30 బస్సులు మంజూరు చేయించానన్నారు. నూతనంగా పదిమంది డ్రైవర్లను నియమించానన్నారు. ప్రయాణికుల అవసరాన్ని కనుగొని అన్ని మార్గాల్లో బస్సులు నడిపేలా చూడాలని ఆర్టీసీ డిఎం మల్లేష్‌కి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ అనంతస్వరూప్‌షెట్కార్, మాజీ వైస్‌చైర్మన్ దారం శంకర్‌సేట్, వినోద్ పాటిల్, రమేష్‌చౌహాన్, పండరిరెడ్డి మాజీ ఎంపిటిసి, మున్సిపల్ కౌన్సిలర్లు తాహెర్ అలీ, మండలకాంగ్రెస్ అధ్యక్షులు సత్యర్‌సేట్, మాణిక్‌ప్రభు సేట్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాదృక్పథంతో ఆసుపత్రి పనిచేయాలి

-మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, మే 14, ప్రభాతవార్త:**
ఖేడ్ పట్టణంలో డాక్టర్ వినయ్‌కుమార్ నూతనంగా నిర్మించిన శ్రీశాన్వి ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్యులకుకూడా అందుబాటులో ఉండేవిధంగా శ్రీశాన్వి ఆస్పత్రి సేవాదృక్పథంతో అధిక లాభార్జన కాకుండా సేవచేసే విధంగా ముందుకు రావాలన్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు పరమేష్, రామ్‌సింగ్, పట్టణపార్టీ అధ్యక్షులు నగేష్‌సేట్, మాజీ సర్పంచ్ పండరి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్‌గౌడ్, రాజు, మాజీ కోఆప్షన్ సభ్యులు, నాయకులు నారాయణ, చింటూ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శైలజ ఈశ్వరకు ఆంగ్లంలో పిహెచ్‌డి

**పటాన్‌చెరు, మే 14, ప్రభాతవార్త:**
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జిఎస్‌హెచ్ఎస్) ఆంగ్లం, ఇతరభాషలవిభాగం పరిశోధకవిద్యార్థిని శైలజ ఈశ్వర డాక్టరేట్‌కు అర్హత సాధించారు. అనితారావు బాదామి, ఉమా పరమేశ్వరన్ ఎంపిక చేసిన నవలల్లో డయాస్పోరిక్ థీమ్‌ల అధ్యయనం అనే అంశంపై ఆమె సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించారు. ఈపరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న జిఎస్‌హెచ్ఎస్ ఆంగ్లం, ఇతరభాషలవిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.జోసెఫ్ జయకర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శైలజ వైవా వోస్ పరీక్షను హైదరాబాద్ కేంద్రీయవిశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి.మురళీ మనోహర్ సమక్షంలో నిర్వహించినట్టు తెలిపారు. డాక్టర్ శైలజ ఈశ్వర సమర్పించిన సిద్ధాంతవ్యాసం పిహెచ్‌డికు అర్హత సాధించడంపట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్‌ఆర్ వర్మ, జిఎస్‌హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్‌జోస్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్, పలువిభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు పేర్కొన్నారు.

## విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు



విద్యార్థులకు బహుమతులందించిన ఎంపి రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, మే 14, ప్రభాతవార్త:**
ఇటీవల విడుదలైన ఇంటర్, పదవతరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెదక్ ఎంపి రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్‌లు ప్రతిభా పురస్కారాలు అందించారు. మెదక్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఈపురస్కారాలను అందించారు. చిన్నశంకరంపేట ఆదర్శపాఠశాల విద్యార్థులు పదవతరగతిలో కావేరి(568), వైష్ణవి(567), సాయితేజ(552), విష్ణువర్ధన్(551) మార్కులు సాధించగా, ఇంటర్‌లో విక్రమ్(974), సృజన(959) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వీరిని మెదక్ ఎంపి రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రతిభా పురస్కారాలు అందించి అభినందించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వాణికుమారి కలెక్టర్, ఎంపిల చేతులమీదుగా ప్రతిభాపురస్కారాలు అందుకోవడం జరిగింది.

## విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

**హవేలీఘనపూర్, మే 14, ప్రభాతవార్త:**
హవేలీఘనపూర్ మండలం ధూప్‌సింగ్ తండాలో బుధవారం శ్రీసేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలో మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పద్మ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. తండాలో సేవాలాల్ మహారాజు గుడికట్టడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆహ్వానించినందుకు తండాప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు మాజీఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వాడిగ్రామ మాజీసర్పంచ్ ఎల్లప్ప ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్సపొందారు. వాడిగ్రామం చేరుకొని ఎల్లప్పను పరామర్శించారు. అనంతరం ముత్తాయికోట మాజీ సర్పంచ్ అనురాధ కృష్ణ కూతురు భవాని వివాహానికిహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం.లావణ్యారెడ్డి మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, మాజీసర్పంచ్‌లు యామిరెడ్డి, సాయగౌడ్, మ్యాకల సాయిలు, శ్రీహరి, మాజీ ఎంపిటిసి బిక్షపతి, నాయకులు బిక్షపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, బాలరాజు, మల్లయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌పార్టీలో మొదలైన పదవుల పందేరం

-పోటాపోటీగా దరఖాస్తులు చేసుకున్న పార్టీ శ్రేణులు..
-ఆశావహుల్లో పార్టీ పదవులు ఎవరిని వరించేనో..?



పార్టీ పదవుల కోసం దరఖాస్తు చేయడానికి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

**సిద్దిపేట, మే 14, ప్రభాతవార్త ప్రతినిధి:**
సిద్దిపేట నియోజకవర్గంలోని 5మండలాలు, గ్రామస్థాయి, పట్టణ, వార్డు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవులను ఆశిస్తున్న కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయానికి బుధవారం పెద్దయెత్తున తరలివచ్చారు. దీంతో పదవులను ఆశిస్తున్న ఆశావహులతో క్యాంపు కార్యాలయం కోలాహలంగా మారింది. సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, నంగునూర్, చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల పార్టీ అధ్యక్షుల పదవుల కోసం పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పదవులను ఆశిస్తున్న ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే 5మండలాల్లోని అన్నిగ్రామాల గ్రామస్థాయి అధ్యక్ష పదవులతోపాటు రెండు బ్లాక్‌కాంగ్రెస్, సిద్దిపేట పట్టణ అధ్యక్ష, వార్డు స్థాయి అధ్యక్ష పదవుల కోసం పార్టీ శ్రేణులు దరఖాస్తులు చేసుకున్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండడంతో పార్టీ పదవుల కోసం పెద్దయెత్తున పార్టీశ్రేణులు దరఖాస్తులు చేసుకున్నారు. హైదారాబాద్ నుంచి వచ్చిన పార్టీ పరిశీలకులు రోహిత్‌రావు, మల్లారి పవన్‌లు ఆశావహులనుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రధానంగా సిద్దిపేట పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్ష పదవి కోసం 20మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తుంది. అలాగే 5మండలాలలో మండలపార్టీ అధ్యక్షపదవి కోసం సైతం ఒక్కొక్క మండలంలో 15నుంచి 20మంది వరకు దరఖాస్తు చేసినట్లు తెలుస్తుంది. సిద్దిపేటపట్టణంలోని వార్డు, మండలాల్లోని గ్రామాలలో గ్రామస్థాయి పార్టీ అధ్యక్ష పదవి కోసం పెద్దయెత్తున దరఖాస్తులు సమర్పించారు. పార్టీ పదవులను ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్న ఆశావహుల దరఖాస్తులను పరిశీలకులు టిపిసిసి అధిష్ఠానంకు అప్పగించనున్నారు. పార్టీ పదవులు ఎవరికి దక్కుతాయో వేచిచూద్దాం. అలాగే దుబ్బాక నియోజకవర్గంలో సైతం పార్టీపదవుల కోసం పరిశీలకులు ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నియోజకవర్గంలో నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి పార్టీపదవుల కోసం వేర్వేరుగా పరిశీలకులకు దరఖాస్తులు సమర్పించారు.

## పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు

**చిన్నశంకరంపేట, మే 14, ప్రభాతవార్త:**
మండలపరిధి సూరారంలోని పెద్దమ్మతల్లి దేవాయల 16వ వార్షికోత్సవాలు నేటినుండి(గురువారం) మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. మొదటి రోజు గురువారం గణపతిపూజ, అమ్మవారి ఉత్సవవిగ్రహాల ఊరేగింపు, శుక్రవారం అగ్నిప్రతిష్ఠ, అభిషేకం, అమ్మవారి కళ్యాణం, బోనాలు, శనివారం అమ్మవారి గుమ్మటాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని ఆలయ అభివృద్ధికమిటీ సభ్యులు కోరారు.

## షీటీం సేవలపై అవగాహన




చిన్నశంకరంపేటలో అవగాహన కల్పిస్తున్న షీ టీం

**చిన్నశంకరంపేట, మే 14, ప్రభాతవార్త:**
జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు చిన్నశంకరంపేట పట్టణకేంద్రంలో బుధవారం మెదక్ షీ టీం తూప్రాన్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులపై హింస, సైబర్ క్రైం, ఈవ్ టీజింగ్‌లకు ఎవరైనా గురైతే షీ టీంలను సంప్రతించాలని షీ టీం హెడ్ కానిస్టేబుల్ దేవదాస్ తెలిపారు. మహిళలభద్రత, ఆన్‌లైన్‌మోసాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం షీ టీం ఉంటుందన్నారు. ఎవరైనా మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే 6303923823కు సంప్రతించాలని వారు తెలిపారు. మహిళలరక్షణ కోసం ప్రతిరోజు బస్టాండ్, ప్రధానచౌరస్తాల్లో, కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా నిఘా ఉంచినట్లు షీ టీం తెలిపారు. బృందసభ్యులు స్వరూపారాణి, గంగమణి, రవి పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

-వివాహ వేడుకలో పాల్గొన్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

**హవేలీఘనపూర్, మే 14, ప్రభాతవార్త:**
గిరిజనుల ఆరాధ్యదైవం జగదాంబ సేవాలాల్ మారాజ్ దేవాలయాల నిర్మాణానికి నావంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధూప్‌సింగ్ తండాలో సేవాలాల్ జగదాంబ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి పాల్గొన్నారు. అనంతరం సిద్ధివినాయక ఫంక్షన్‌హాల్లో మదుల్వాయి మాజీ సర్పంచ్ అనురాధ కృష్ణమూర్తి కూతురు వివాహానికి హాజరై ఆశీర్వదించారు. ఆయన వెంట ఎంపిటిసిల పురం మాజీ జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి మాణిక్యరెడ్డి మార్కెట్‌కమిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి ఏడుపాయల ఆలయ చైర్మన్ బాలగౌడ్, మాజీ సర్పంచులు మేకల సాయిలు సునీత యామిరెడ్డి నర్సిరెడ్డి ఎంపిటిసిలు జ్యోతి, సీతారాం రెడ్డి, తెరాస కార్యకర్తలు ధూప్‌సింగ్ తండావాసులు పాల్గొన్నారు.

## సిద్ధిపేటలో అండర్-25 క్రికెట్ జట్టు ఎంపిక

**సిద్దిపేట రూరల్, మే 14, ప్రభాతవార్త:**
హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో అండర్-25 జట్టు ఎంపికచేయడం జరుగుతుందని సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ జిల్లాకార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జట్టు ఎంపిక ఉదయం 9గంటలనుంచి స్టేడియంలో ప్రారంభించడం జరుగు తుందన్నారు. ఆగస్టు 31, 2000 సంవత్సరం తర్వాత జన్మించిన వారు జట్టు ఎంపికకు అర్హులు అన్నారు. యూనిఫాం, క్రికెట్ కిట్స్, ఇతర క్రీడా సామగ్రితో క్రికెట్ స్టేడియంలో హాజరు కావాలన్నారు.

## పేదింటి వధువుకు పుస్తెమెట్టెలు అందజేత

**రాయపోల్, మే 14, ప్రభాతవార్త:**
పేదింటి వధువు పెళ్లికి కావాల్సిన పుస్తెమెట్టెలను అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు మండల కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకులు రామగౌడ్. బుధవారం రాయపోల్ మండలపరిధిలోని మంతూర్ గ్రామానికి చెందిన నిరుపేదకుటుంబం తాళ్ల బాలయ్య కుమార్తె అనూష వివాహానికి అవసరమైన పుస్తెమెట్టెలను వారు అందజేసారు. ఈసందర్భంగా పాల రామగౌడ్‌కి కుటుంబసభ్యులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పట్నం యాదగిరి, ఈరమైనా యాదగిరి, మాజీసర్పంచ్ మల్లేశం, డాక్టర్ చందు, సాయిరెడ్డి, బందారం రవి, దండు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి చేయూత

**సిద్దిపేట అర్బన్, మే 14, ప్రభాతవార్త:**
ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడమే ఆర్యవైశ్య మహాసభ, వాసవీ క్లబ్‌ల లక్ష్యమని రాష్ట్ర ఆర్యవైశ్యమహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్‌లు అన్నారు. కామారెడ్డిజిల్లా ఘనపూర్ గ్రామాలోని వైశ్యకుటుంబానికి చెందిన మ్యాడం సంతోష్ ఆర్థిక ఇబ్బందులతో జీవనోపాధి కోసం సిద్దిపేటకు వచ్చారని తెలిపారు. బుధవారం వారు సిద్దిపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పేదకుటుంబానికి రూ.51911, 50 కిలోల బియ్యం అందజేసి మాట్లాడారు. పేదలకు సేవ చేయడంలోనే జీవితంలో నిజమైన తృప్తి లభిస్తుందన్నారు. పేదలను ఆదుకోవడానికి సంపన్నులు ముందుకు రావాలన్నారు. ఆర్యవైశ్య మహాసభ, వాసవీక్లబ్‌ల ద్వారా భవిష్యత్‌లో పేదల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పేద కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైశ్యభవన్ కార్యదర్శి పొశెట్టి శ్రీకాంత్, కోశాధికారి గంప కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి చకిలం రవి, వాసవీక్లబ్ నాయకులు మాంకాల నవీన్‌కుమార్, మురంశెట్టి కుమార్, మాచిగుల్లపల్లి మంజుల, ఎర్రం శివశంకర్, మర్యాల వీరేశం, కొత్తకొండ రాజు, కొండూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంబలి,పులిహోర పంపిణీ

**గజ్వేల్ టౌన్, మే 14, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణ కేంద్రంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద బుధవారం గజ్వేల్ ప్రభుత్వపాఠశాలలో 1984సంవత్సరం టెన్త్‌విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత అంబలి,పులిహోర పంపిణీకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పాల్గొని మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎవరు వడదెబ్బబారిన పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో అంబలిపంపిణీ చేయడం సంతోషంగా ఉందని పూర్వవిద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్నిసేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తోట భిక్షపతి, అయిత సత్యనారాయణ, శ్రీనివాస్, లయన్ నేతి శ్రీనివాస్, ఉమాదేవి, సుచరిత, శ్రీనివాస్, గంగిశెట్టి శ్రీనివాస్, జగ్గయ్యగారి శ్రీనివాస్, రాందాస్‌గౌడ్, గుంటుకు యాదగిరి, దూబకుంట లక్ష్మణ్, నర్సింలు, నేతి వేణుగోపాల్, ఓబుల్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణవేణి, జ్ఞానేశ్వర్, గౌరిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.